

ముగ్గురమ్మల దర్శనం

బాసరలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. విజయ దశమి సందర్భంగా గురువారం శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. - బాసర

ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

న్యూస్‌రీల్

మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు, చిన్నారుల రక్షణకు పోలీసుశాఖ తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా షీటీం ద్వారా సెప్టెంబర్‌లో 96 హాట్‌స్పాట్లను గుర్తించి 28 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బాధితుల నుంచి 17 ఫిర్యాదులు స్వీకరించి 6 ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, 11 కేసుల్లో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వెల్లడించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం షీటీం, భరోసా కేంద్రం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బాధితులు ఆసిఫాబాద్ డివిజన్ షీటీం నం.87126 70564, కాగజ్‌నగర్ డివిజన్ నం.87126 70565 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

పరిశుభ్రతకు సమయం కేటాయించాలి



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయం పరిసరాల పరిశుభ్రతకు కేటాయించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం స్పెషల్ క్యాంపెయిన్ 5.0ను ప్రారంభించారు. జీఎం మాట్లాడుతూ స్పెషల్ క్యాంపెయిన్ కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, సమాజంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజలు సమయం కేటాయిస్తే పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరిగూర పీవో మచ్చగిరి నరేందర్, ఏజీఎం కృష్ణమూర్తి, డీజీఎంలు ఉజ్వల్‌కుమార్, మదీనాబాషా, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, ఏఎస్‌వో శ్రీధర్, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, అన్ని విభాగాల అధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటం'



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆత్మగౌరవం, సమానత్వమే లక్ష్యంగా కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ అన్నారు. కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న కేవీపీఎస్ ఆవిర్భవించిందని తెలిపారు. అనేక ఉద్యమాలు, పోరాటాలతో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించడంలో ప్రధాన భూమిక పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్, మల్లేశ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి వద్ద విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: వృత్తివిద్య కోర్సులో చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, డిజిటల్ ఫొటో స్టూడియోను సందర్శించారు. విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. సెలవులో వృత్తివిద్య కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇంటర్న్ షిప్‌లో భాగంగా ప్రత్యక్షంగా ప్రయోగ పూర్వక జ్ఞానాన్ని పొందారని పేర్కొన్నారు. ఈ శిక్షణ జీవితంలో సొంతంగా రాణించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ రాజు, సులోచన పాల్గొన్నారు.

ప్రయాణ భారం!

- జిల్లా నుంచి హైదరాబాద్ మార్గంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులేవి..?
- మహాలక్ష్మి పథకం ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి
- ఇతర బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులు
- ఎక్స్‌ప్రెస్ బస్సులు పెంచాలని మహిళల విన్నపం



ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటున్నారు. దీంతో బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అయితే జిల్లా నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు తగినన్ని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తున్నా లగ్జరీ, లహరి వంటి బస్సులు, రైళ్లలో డబ్బులు చెల్లించి వెళ్లాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ జిల్లా కేంద్రంలోని డిపో నుంచి 58 ప్రత్యేక బస్సులు నడిపింది. ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు.

డిపోలో 81 సర్వీసులు

జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో 81 బస్సు సర్వీసులు ఉండగా, 75 బస్సులు వివిధ రూట్లలో నడుస్తున్నాయి. వీటిలో రెండు లహరి, 14 లగ్జరీ, రెండు డీలక్స్, 10 ఎక్స్‌ప్రెస్, మిగిలినవి ఆర్డినరీ బస్సులు ఉన్నాయి. డిపోలో 320 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 125 మంది కండక్టర్లు, 118 మంది డ్రైవర్లు, 77 మంది ఇతర సిబ్బంది ఉన్నారు. ప్రతిరోజూ డిపో ఆదాయం రూ.18 లక్షలు కాగా, ప్రస్తుతం రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు సమకూరుతోంది. నిత్యం 36,516 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, వీరిలో 25,366 మంది స్త్రీలు, 11,150 మంది పురుషులు ఉంటున్నారు. మహాలక్ష్మి పథకాన్ని రాష్ట్రంలో 200 కోట్ల మహిళలు వినియోగించుకున్న నేపథ్యంలో జూలైలో ఆర్టీసీ ప్రత్యేక సంబురాలు నిర్వహించింది. ఇక డిపో పరిధిలో సుమారు 2 లక్షల మహిళలు ప్రయాణించగా, రూ.50 కోట్లకు పైగా ఆదాయం వచ్చింది.

68 శాతం మహిళలే..

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో 68 శాతం మహిళలే ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం వారికి కేవలం ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీలో మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా, కొన్ని రూట్లలో ఆ బస్సులు అందుబాటులో ఉండడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ వెళ్లే మహిళలు ఎక్స్‌ప్రెస్‌లు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఉచిత పథకం ఉన్నప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో లగ్జరీలో చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తోంది. రద్దీకి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంఖ్య పెంచాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వయా కాగజ్‌నగర్‌తో సమయం వృథా..

జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు ప్రతిరోజూ 14 సూపర్ లగ్జరీ సర్వీసులు నడుస్తున్నాయి. ఉదయం ఏడు సర్వీసులు, రాత్రి ఏడు సర్వీసులు ఉన్నాయి. జిల్లా కేంద్రం నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు నిత్యం రాత్రి సర్వీసుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రాత్రి సర్వీసుల్లో కేవలం రెండు బస్సులు మాత్రమే నేరుగా హైదరాబాద్ వెళ్తుండగా, మిగిలిన సర్వీసులు వయా కొటాల, కాగజ్‌నగర్, గోలేటి నుంచి వెళ్తున్నాయి. దీంతో నేరుగా హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులపై అదనపు భారం పడుతోంది. బస్సు చార్జీ అధికం కావడంతోపాటు వారి సమయం కూడా వృథా అవుతోంది. లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సంఖ్య పెంచడంతోపాటు జిల్లా కేంద్రం నుంచి నేరుగా నడిచే సర్వీసులు మరిన్ని అందుబాటులోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఆర్టీసీ నిబంధనల ప్రకారం ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 150 కిలోమీటర్లకు మించి నడపరాదు. ఆసిఫాబాద్ డిపో నుంచి కొత్త సర్వీసుల కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా జిల్లా కేంద్రం నుంచి త్వరలో కొత్త సర్వీసులు ప్రారంభిస్తాం.

– రాజశేఖర్, ఆర్టీసీ డీఎం, ఆసిఫాబాద్

చోరీలతో భయం.. భయం!

కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్ట్ లైన్‌లోని ఎస్పీఎం టీఆర్టీ- 111 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న కమల్ కిశోర్ లోయ సెప్టెంబర్ 30న రాత్రి 8 గంటలకు ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి ఎస్పీఎం క్రికెట్ మైదానంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు తిరిగి వచ్చేసరికి క్వార్టర్స్ వెనుక నుంచి గుర్తుతెలియని దుండగులు లోపలికి చొరబడి 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు అపహరించారు. కాగజ్‌నగర్ పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు భయం.. భయంగా గడుపుతున్నారు.



- కాగజ్‌నగర్‌లో వరుస దొంగతనాలు
- హడలిపోతున్న పట్టణ వాసులు
- కొరవడిన పోలీసుల నిఘా

కాగజ్‌నగర్‌టౌన్: చోరీలతో కాగజ్‌నగర్ పట్టణ ప్రజలు భయం గుప్పిట్లో గడుపుతున్నారు. ఆరు నెలలుగా వరుస ఘటనలు చోటు చేసుకుంటుండగా, వారం రోజుల వ్యవధిలో నాలుగు దొంగతనాలు జరిగాయి. కాగజ్‌నగర్ పట్టణంలోని ఫారెస్ట్ లైన్‌లోని ఎస్పీఎం టీఆర్టీ- 111 క్వార్టర్‌లో శుక్రవారం చోరీ జరిగింది. రాత్రి 10 గంటలకు దుండగులు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. అంతకు ముందు సెప్టెంబర్ 29న సద్దుల బతుకమ్మ రోజు కూడా రాత్రి ఓల్డ్ కాలనీలోని డి- 111 క్వార్టర్ ఇంటి పైకప్పు పగలగొట్టి ఇంట్లోకి దొంగలు చొరబడ్డారు. రెండు తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా రాత్రిపూట అగంతకులు ఇంటి తలుపులు కూడా తడుతున్నారని మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. పోలీసుల నిఘా తగ్గడంతోనే దొంగలు చేతికి పని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కొందరు బాధితులు ఫిర్యాదు చేస్తుండగా, కొందరు మాత్రం ఫిర్యాదుకు వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు సైతం చోరీల వివరాలు బయటకు పొక్కకుండా ఇంటి యజమానులతో మాట్లాడి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పూర్తిస్థాయి నిఘా ఏది..?

కాగజ్‌నగర్ పట్టణంలో 30 వార్డులు ఉండగా, 70 వేల వరకు జనాభా ఉంది. పట్టణంలో పోలీసు నిఘా కొరవడిందనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రిళ్లు కాసేపు పోలీసులు వాహనం తిప్పి ఫొటోలు తీసుకోవడం తప్ప పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం లేదని పట్టణవాసులు మండిపడుతున్నారు. గతంలో చోరీలు చేసిన నేరస్తులను పట్టుకోకపోవడం, కేసుల్లో పురోగతి లేకపోవడంతో వారే మళ్లీ ఇక్కడే చోరీలు చేస్తున్నారా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. ప్రధానంగా పట్టణంలోని ఎస్పీఎం క్వార్టర్స్ ఎక్కువగా ఖాళీగా ఉన్నాయి. ఇళ్ల చుట్టూ చెట్లు ఏపుగా పెరిగి పెరిగాయి. సిర్పూర్ పేపర్ మిల్లులో ఇతర ప్రాంతాలైన బీహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఒక్కో క్వార్టర్‌లో 10 నుంచి 15మంది గ్రూప్‌లుగా ఉంటున్నారు. ఎవరు పనిచేస్తున్నారో.. ఎవరు చేయడం లేదో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ఓల్డ్ కాలనీ, న్యూకాలనీ క్వార్టర్లలో అపరిచితులు తిరుగుతున్నారని కాలనీల ప్రజలే చెబుతున్నారు. పోలీసులు నిఘా పెంచి చోరీలు అరికట్టాలని కోరుతున్నారు.

నాలుగు టీంలు ఏర్పాటు చేశాం



కాగజ్‌నగర్ పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రిపూట గస్తీ పెంచుతాం. దొంగలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల ఆధారంగా దుండగులను పట్టుకుంటాం. – వహీదుద్దీన్, డీఎస్పీ, కాగజ్‌నగర్

ఇటీవలి ఘటనలు

- ఈ ఏడాది కాలంలో పట్టణంలో చోరీలు అధికమయ్యాయి. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీల్లో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నగదును అపహరించారు.
- కాగజ్‌నగర్ పట్టణంలోని త్రినేత్ర శివాలయంలోని గర్భగుడిలోని వెండి నాగబడిగ, ఆభరణాన్ని అపహరించారు.
- కాపువాడలోని పంచముఖ ఆంజనేయ దేవాలయంలో రెండుసార్లు చోరీ చేశారు. హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లారు.
- శ్రీరాంనగర్ కాలనీలోని ఓ ఇంట్లో తాళం వేసి ఉండగా.. పగలగొట్టి ఇంట్లో దూరారు. నగదును ఎత్తుకెళ్లారు.
- కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం గర్భగుడిలోని శివలింగంపై ఉన్న ఇత్తడి కలశాన్ని అపహరించారు.

అర్హులకు ఇన్సెంటివ్ చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): అర్హులైన ప్రతీ కాంట్రాక్టు కార్మికుడికి ఇన్సెంటివ్ చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు, క్లీనర్లకు ఇన్సెంటివ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోలేటి సీహెచ్‌పీ దారిలో రాస్తారోకో చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఇటీవల ప్రకటించిన స్పెషల్ ఇన్సెంటివ్ రూ.5500 ఇప్పటికీ చాలా మంది డ్రైవర్లు, క్లీనర్లకు అందలేదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏరియా అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై వెంకట్‌కృష్ణ, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని ఏఐటీయూసీ నాయకులతో మాట్లాడారు. అర్హులకు ఇన్సెంటివ్ అందిస్తామని సింగరేణి అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఏఐటీయూసీ నాయకుల రాస్తారోకోతో బొగ్గు సరఫరా లారీలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాయిల్ల నర్సయ్య, కార్మికులు అశోక్, సతీశ్, రాజశేఖర్, రాజలింగు, శ్రీకాంత్, శ్రీనివాస్, రవీందర్, రాజన్న, వెంకటేశ్, హనుమంతు, శ్యాంరావు, విష్ణువర్ధన్, గోపాల్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న ఏఐటీయూసీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకట్‌కృష్ణ

అంబరాన్నంటిన దసరా సంబురం



కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద రావణదహనం



కాగజ్‌నగర్‌లో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు దంపతులు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా వ్యాప్తంగా గురువారం దసరా వేడుకలు సంబురంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిర్, కేస్లాపూర్ హనుమాన్ మందిర్ ఆవరణలో పెద్ద ఎత్తున వాహన పూజలు చేశారు. కేస్లాపూర్ హనుమాన్ ఆలయం వద్ద అర్చకులు ఇందారపు మధుకర శర్మ, నిమ్మకంటి మహేశ్‌శర్మ, వారణాసి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో శమీ పూజ నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణాసుర వధకు లక్కీడిప్ ద్వారా శ్రీరామ చంద్రుడిని ఎంపిక చేశారు. శ్రీరామచంద్రుడిగా ఎంపికైన పట్టణానికి చెందిన చిలుకూరి రాధాకృష్ణాచారిని బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, బుల్లితెర దర్శక, నిర్మాత దండనాయకుల సురేశ్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు శాలువా, పూలదండలతో సన్మానించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రావణాసురుడి ప్రతిమను రాధాకృష్ణాచారి చేతుల మీదుగా దహనం చేశారు. పెద్దఎత్తున టపాసులు పేల్చి సంబురాలు జరుపుకొన్నారు. బుల్లితెర దర్శక, నిర్మాత సురేశ్‌కుమార్ మాట్లాడుతూ చెడును జయిస్తూ మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. సాంస్కృతిక కళాకారులు అన్వేశ్, గౌరీశ్, భవానీ ఆలపించిన భక్తిగీతాలు అకట్టుకున్నాయి. సాయి మందిరంలో అర్చకులు ఇందారపు మధుకర శర్మ, సాయిశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయిబాబా ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దంపతులు శమీ వృక్షానికి పూజలు చేశారు. అనంతరం ఏఎస్పీ చిత్తరంజన్ రావణసుర దహనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. త్రిశూల్ పహాడ్‌పై ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయంలో సత్యనారాయణస్వామి, దుర్గామాతలను దర్శించుకున్నారు. భక్తులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సీఐ ప్రేంకుమార్, ఆలయ కమిటీ సభ్యులు మహావీర్ ప్రసాద్‌లోయ, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాస్, ప్రేమకుమార్, అగర్వాల్, పవన్ బల్దేవ్, అరుణ్‌లోయ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో రావణ దహనం నిర్వహిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్



జిల్లా కేంద్రంలో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, కాలనీవాసులు

ప్రజలకు విజయాలు చేకూర్చాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్: విజయ దశమి ప్రజలకు విజయాలు చేకూర్చాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం ఆయుధ పూజ, వాహన పూజ, శమీపూజ నిర్వహించారు. దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి పర్వదినం ప్రజలకు సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం అప్రమత్తంగా ఉండే పోలీసులు తమ విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలను దైవ స్వరూపంగా భావించి పూజలు చేయడం సంప్రదాయంగా వస్తుందని తెలిపారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా అలయ్ బలయ్ నిర్వహించి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎస్పీ, ఏఎస్పీని ఎత్తుకుని సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు అంజన్న, పెద్దన్న, సీఐ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఆర్ఎస్సైలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్, తదితరులు

గాంధీ చూపిన మార్గంలో నడుద్దాం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: మహాత్మా గాంధీ చూపిన శాంతిమార్గంలో నడుద్దామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ అహింస మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని పేర్కొన్నారు. గాంధీ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ జిల్లా అధికారి శివకుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ స్పెషల్ సబ్‌జైలులో గాంధీ జయంతి పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన పొరపాట్లతో కుటుంబాలకు దూరంగా ఉండి శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో గాంధీ బాటలో నడవాలని సూచించారు. జైలులో ఖైదీలకు మెరుగైన సేవలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ బాలాజీ వరప్రసాద్, డిప్యూటీ జైలర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు, సిబ్బంది

భగీరథ.. ఇదేం వ్యథ..!



జిల్లెడలో బావి నుంచి నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

పదిరోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెంచికల్‌పేట్ మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామాల ప్రజలు నీటి కోసం సమీపంలోని బావితోపాటు ప్రాణహిత నది వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎడ్లబండ్లతో నీటిని తెచ్చుకుంటున్నారు. భారీ వర్షాలకు నీరు కలుషితం కావడంతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– పెంచికల్‌పేట్

క్లుప్తంగా

అడవిపందిని ఢీకొని అదుపుతప్పిన కారు



అడవిపంది కళేబరం

కోటపల్లి: వేగంతో ఉన్న కారు అడవిపందిని ఢీకొని అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వివరాలు.. శుక్రవారం మహారాష్ట్రలోని అంకిసా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు కొల్లూర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై అడ్డుగా వచ్చిన అడవిపందిని ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడగా, అడవిపంది అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు అడవిపందికి పంచనామా నిర్వహించి ఖననం చేశారు.

గొడవ ఆపేందుకు వెళ్లిన వ్యక్తిపై బీరు సీసాతో దాడి

కాసిపేట: మండలంలోని కొండాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలోని వైన్‌షాప్ వద్ద శుక్రవారం సాయంత్రం గోడం రాంచందర్‌పై బీరు సీసాతో ఓ వ్యక్తి దాడి చేసినట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అచ్యుతరావ్‌గూడకు చెందిన ఓరియంట్ కాంట్రాక్ట్ కార్మికుడు రాంచందర్ సబ్‌స్టేషన్ వద్ద ఉన్న వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో అచ్యుతరావుగూడకు చెందిన కనకజంగు, దేవాపూర్‌కు చెందిన బోర్లకుంట ప్రణయ్ గొడవ పడుతుండగా రాంచందర్ ఆపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రణయ్ బీరు సీసాతో రాంచందర్ తలపై ఎడమ వైపు కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శతాధిక వృద్ధురాలికి సన్మానం



వృద్ధురాలిని సన్మానిస్తున్న నాయకులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని హనుమాన్ కాలనీకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు బత్తుల రేణుకాబాయి 101వ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఏఐసీసీ విచార్ విభాగ్ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ ఆమె ఇంటికి వచ్చారు. ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. శాలువాతో సన్మానించారు. వందేళ్లు దాటినా ఆరోగ్యంగా ఉండడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆయుధ పూజ నిర్వహించిన ఎమ్మెల్యే వినోద్



ఆయుధాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ ఏరియా క్యాంపు కార్యాలయంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆయుధ, వాహనాల పూజ చేశారు. క్యాంపు కార్యాలయం ఆవరణలో రోజువారీగా వినియోగించే తన వాహనాలు, అంగరక్షకుల ఆయుధాలకు పూలమాల వేసి కొబ్బరి కాయ కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గన్‌మెన్లు, కారు డ్రైవర్ పాల్గొన్నారు.

మహాత్మా.. మన్నించు!

- గాంధీజయంతి రోజు 'బెల్ట్' జోరు
- 'మామూలు'గా తీసుకున్న అధికారులు

మంచిర్యాలక్రైం: దసరా పండుగ, గాంధీ జయంతి రెండూ ఒక్కరోజే రావడంతో ఏమి చేయాలో తెలియక ఒక్కసారికి మహాత్మా.. మన్నించు.. అంటూ బెల్ట్‌షాపుల నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం విక్రయాలకు తెరలేపారు. ప్రభుత్వం గాంధీ జయంతిరోజు మందు, మాంసాన్ని నిషేధించింది. అయితే, మాకేంటని ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కేసి మద్యం దుకాణాల వ్యాపారులే బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిపినట్లు తెలిసింది. మంచిర్యాల జిల్లాలో గల్లీకో బెల్ట్‌షాపు తెరిచి మద్యం విక్రయాలు జరిపించారు. గాంధీ జయంతి సందర్భంగా మద్యం ఎవరు విక్రయించినా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రంలోని హమాలీవాడ వైపు రైల్వేస్టేషన్ పక్కనే ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడు 'పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులకు మామూళ్లు ఇస్తున్నాం.. మమ్మల్ని ఎవరు ఏమీ చేయలేరు' అని ఓ విలేకరితో దురుసుగా ప్రవర్తించడం గమనార్హం.

అశ్వరథంపై అమ్మవారి ఊరేగింపు



అమ్మవారిని అశ్వరథంపై ఊరేగిస్తున్న ఈవో, అర్చకులు, భక్తులు

- బాసరలో ముగిసిన శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. గురువారం సాయంత్రం 4గంటల సమయంలో ఆలయ అర్చకులు సరస్వతీ అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అశ్వరథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కూర్చోబెట్టి భక్తుల దర్శనార్థం గ్రామంలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అశ్వరథం గ్రామంలోకి రావడంతో మహిళలు మంగళహారతులతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. భక్తి గీతాలు, కోలాటాల మధ్య అమ్మవారి అశ్వరథం ఊరేగింపు కొనసాగింది. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి అశ్వరథం ఊరేగింపు కోసం స్వచ్ఛందంగా గ్రామానికి చెందిన ప్యాట్ల సుఖేశ్‌రావు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారిని దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి అంజనాదేవి, ఏఈవో సుదర్శన్‌గౌడ్ శాలువాతో సన్మానించారు.

బాసరకు శృంగేరి పీఠాధిపతి

కర్ణాటక రాష్ట్రంలోని మహాస్థానం దక్షిణమనయ శ్రీశారదాపీఠం శృంగేరి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీ విధుశేఖర భారతీయ సన్నిధానం పీఠాధిపతి బాసరకు రానున్నారు. శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్ర పర్యటన ఈ నెల 17 నుంచి 19వరకు కొనసాగనుంది. నేపాల్, న్యూఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా యాత్ర చేపడుతూ బాసరలో సరస్వతీ అమ్మవారికి రెండురోజులపాటు ప్రత్యేక పూజలు చేయనున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి



కుమార్ యాదవ్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణానికి చెందిన హోమియోపతి వైద్యుడు కుమార్ యాదవ్ (43) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. పురాణాబజార్‌కు చెందిన డాక్టర్ కుమార్ యాదవ్ గురువారం బైక్‌పై నిర్మల్ వైపు వెళ్లి తిరిగి సాయంత్రం భైంసా వైపు వస్తుండగా, రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గంలో భైంసా-నిర్మల్ హైవేపై ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఏదైనా వాహనం ఢీకొందా.. లేదా అదుపు తప్పి కిందపడ్డాడా? అనే విషయం తెలియరాలేదు. అతడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఏరియా స్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. కుమార్ యాదవ్ స్థానికంగా హిందూ ఉత్సవ సమితి సభ్యుడిగా ఉంటూ స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. దీంతో ఆయన మృతిపై పట్టణానికి చెందిన వైద్యులు, పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సోలార్ విద్యుత్ తీగ తగిలి రైతు..



నారాయణరెడ్డి (ఫైల్)

నేరడిగొండ: పంట రక్షణకు అమర్చిన సోలార్ ఫెన్సింగ్ తీగకు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని తేజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేటి నారాయణరెడ్డి (59) కోతుల బెడద నుంచి పంట రక్షణకు చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ఉదయం కోతులు వచ్చాయని తెలియగా వాటిని తరమడానికి చేనుకు వెళ్లాడు. ఈ క్రమంలో సోలార్ ఫెన్సింగ్ తీగకు తగిలి కింద పడ్డాడు. పక్కనే వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రైతులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రైవేట్ వాహనంలో బోథ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అతడు మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు నవనీత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వాగుకు చేపలకు వేటకు వెళ్లి ఒకరు..



సాయినాథ్ (ఫైల్)

తానూరు: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై షేక్ జుబేర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దామాజీ సాయినాథ్ (40) ఈ నెల 1న చేపలు పట్టేందుకు సింగన్‌గాం సమీపంలోని వాగుకు వెళ్లి రెండు రోజులైనా తిరిగి రాలేదు. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. ఆ మార్గంలో వెళ్తున్న కొంతమంది నీటిలో తేలిన మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. తానూరువాసులు దామాజీ సాయినాథ్‌గా గుర్తించారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ప్రమాదంలో గాయపడి వృద్ధురాలు..



లింగమ్మ (ఫైల్)

జైపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఎల్కంటి గ్రామానికి చెందిన యువకుడు తుంగపిండి శివరాం గత నెల 24న రాత్రి తన బైక్‌తో అదే గ్రామానికి చెందిన జనగామ లింగమ్మ (70) ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడ్డ లింగమ్మను మంచిర్యాలలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజాము మృతి చెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడు..

నిర్మల్ టౌన్: నిర్మల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన కొప్పుల సాయన్న (37) గంజాల్ టోల్ ప్లాజాలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం పని నిమిత్తం నిర్మల్‌కు బైక్ వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సాయన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



వెంకట్ (ఫైల్)

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన హర్షముత్తుల వెంకటి (40) గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటికి గతంలో ప్రమాదంలో కాలు విరగగా ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం బైక్‌పై గ్రామానికి చెందిన పోశెట్టిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పోశెట్టి కాలు విరగడంతో పోలీస్‌స్టేషన్‌లో వెంకటిపై కేసు నమోదైంది. దీంతో జీవితంపై విరక్తితో శుక్రవారం గ్రామ శివారులో ఆదిలాబాద్ వైపు వస్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

కుంటాల: అనారోగ్యంతో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని మలక్‌జాం గ్రామానికి చెందిన గుజ్జోల్ల లక్ష్మీబాయి (80) తన కూతురుకు మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన మారుతికి ఇచ్చి వివాహం చేసింది. రెండేళ్ల క్రితం తన కుమారుడు చనిపోగా దౌనెల్లిలోనే కూతురు వద్ద ఉంటోంది. ఎనిమిదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు మూడు నెలల క్రితం ఆపరేషన్ జరిగినా ఆరోగ్యం నయం కాలేదు. దీంతో మనస్తాపంతో గురువారం గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన బురిడెవార్ పీరాజీ ఆమె మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతురాలి కూతురు శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు..

భైంసాటౌన్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన మాచల్వార్ అశోక్ అలియాస్ సంతోష్ (24) స్థానికంగా కూలీ పని చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కాగా, వచ్చిన డబ్బులను మద్యానికి ఖర్చు చేసేవాడు. రోజులాగే బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గురువారం ఉదయం పట్టణంలోని ఖత్‌గాం మార్గంలోగల హోటల్ సమీపంలో మృతి చెంది కనిపించాడు. ఈ మేరకు మృతుడి భార్య దీపాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కుప్పకూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం



కూలిన ఇల్లు

నార్నూర్: మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో మండలంలోని నాగల్‌కొండ గోండుగూడ గ్రామానికి చెందిన కే లక్ష్మణ్ ఇల్లు కుప్పకూలింది. ఇంట్లోని వారు అప్రమత్తమై బయటికి రావడంతో ప్రమాదం తప్పింది. నిత్యావసరాలు తడిసిపోయాయని బాధితుడు లక్ష్మణ్ తెలిపాడు. అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన మోదం సురేందర్ (45) మృతదేహం కడెం ప్రధాన కాలువలో లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 1న కడెం ప్రధాన కాలువలో స్నానం చేయడానికి వెళ్లిన సురేందర్ ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. వరద ఉధృతిలో కొట్టుకుపోవటంతో ఇరిగేషన్ అధికారులకు సమాచారం తెలుపగా కడెం ఎడమ కాలువ నీటిని నిలిపివేసి గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం బుట్టాపూర్ గ్రామ శివారులో కాలువ వద్ద చెట్ల పొదల్లో స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ఆస్పత్రికి తరలించారు.

శోభాయాత్రలో యువకుడికి గాయాలు



మాట్లాడుతున్న అవినాష్‌కుమార్

ముధోల్: మండలంలోని బోరిగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన నిమజ్జన శోభాయాత్రలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. సౌండ్ సిస్టంపై ఉన్న యువకుడికి రాయి వచ్చి తగలడంతో గాయమైంది. దీంతో కొద్దిసేపు శోభాయాత్ర ఆగిపోయి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ సిబ్బందితో హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అందరినీ సముదాయించారు. శోభాయాత్ర సమయంలో రాళ్ల దాడి జరగగా యువకుడికి గాయమైనట్లు తెలుసుకుని ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని నచ్చజెప్పగా గొడవ సద్దుమణిగింది. అనంతరం గ్రామస్తులు నిమజ్జనం కోసం దుర్గామాతలను గోదావరికి తరలించారు. ఎలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

నిమజ్జనంలో సౌదీ షేక్



భక్తులతో నృత్యం చేస్తున్న షేక్ మోహసిన్

నిర్మల్‌ఖిల్లా: దుర్గాదేవి నిమజ్జనోత్సవంలో సౌదీ అరేబియా దేశానికి చెందిన యువ వ్యాపారవేత్త సందడి చేశాడు. జిల్లా నుంచి సౌదీ అరేబియా దేశంలో ఉపాధి పొందుతున్న ఎన్‌ఆర్‌ఐల ఆహ్వానం మేరకు సౌదీ షేక్ అబ్దుల్లా మోహసిన్ సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామ పరిధిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యాడు. నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్న షేక్‌తో కలిసి ఫొటోలు దిగేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

అతివలకు అండగా షీటీం

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



అఖిల్ మహాజన్, ఆదిలాబాద్ ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: షీటీం 24గంటలు సేవలందిస్తోందని ఎస్పీ అఖిల్ మహాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రత, రక్షణకు పని చేస్తోందని పేర్కొన్నారు. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో రాత్రి వేళ మహిళలను వేధించిన ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని 16 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. దసరా సందర్భంగా రాత్రి వేళ దస్నాపూర్ ప్రాంతంలో మహిళలను వేధించిన జిల్లా కేంద్రానికి చెందిన షిండే రాహుల్, యోగేశ్, పద్మశాలీ విఠల్, షిండే నితిన్, అడలోలు నరేశ్, రోహిత్, బొంపల్లి ప్రసాద్, షేక్ పర్వేజ్, ధూత్రి పరమేశ్వర్‌పై మావల పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఇటీవల ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రలోని కేళాపూర్ వెళ్లే పాదయాత్ర సమయంలో మహిళను వేధించిన మడావి దత్తుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా యువత, విద్యార్థులు, పని స్థలాల్లో మహిళలకు 20 అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో 24 ఈ పెట్టీ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నెల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 119 హాట్‌స్పాట్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆరు కౌన్సిలింగ్‌ల ద్వారా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆపద ఎదురైతే ఆదిలాబాద్ షీటీం బృందాలకు 8712659953 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈనెలలో మహిళల నుంచి దాదాపు 31ఫోన్‌కాల్స్ ద్వారా ఫిర్యాదులు రాగా పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

'కడెం' ఆధునికీకరణకు ఉద్యమం



మాట్లాడుతున్న గాదె శ్రీనివాస్

దండేపల్లి: చెన్నూరు వరకు సాగునీరు అందించాలని మండలంలోని నెల్కివెంకటాపూర్‌కు చెందిన గాదె శ్రీనివాస్ కొంతమంది రైతులతో కలిసి దసరా పండుగను పురస్కరించుకుని గురువారం కడెం ప్రాజెక్ట్ ఆధునికీకరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కడెం ప్రాజెక్ట్ నీటిని చెన్నూరు వరకు అందించేందుకు 1987లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హాజీపూర్ మండలం పెద్దంపేట వద్ద మందాకిని కాలువ నిర్మాణానికి భూమిపూజ చేశారని, అది ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. కడెం నీటిని చెన్నూర్ వరకు అందించాలంటే మొదటగా కడెం ప్రాజెక్టును ఆధునికీకరించాలన్నారు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న నీరు హాజీపూర్ మండలం వరకే అందించడం గగనంగా మారిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు కడెం ప్రాజెక్ట్ ఆధునికీకరణపై దృష్టిసారించి అప్పటి ప్రధాని, ముఖ్యమంత్రుల హామీలను అమలు చేయాలని కోరారు. కడెం ప్రాజెక్టును ఆధునికీకరించే వరకు ఆయకట్టు రైతులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

దాడి ఘటనలో నిందితులపై కేసు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియా వద్ద గురువారం ఇద్దరు యువకులపై విచక్షణా రహితంగా కొందరు దాడి చేసి గాయపర్చారు. దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సర్కిల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజశేఖర్‌తో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. పాలచెట్టు ఏరియాలో ఉన్న పచ్చిక రవితేజ, బండ రాకేశ్‌కు స్థానిక విద్యానగర్‌కు చెందిన కొందరు యువకులకు ఆటో యూ టర్న్ తీసుకునే విషయంలో ఘర్షణ ఏర్పడింది. ఆటోలో వచ్చినవారు విచక్షణారహితంగా ఇద్దరు యువకులపై తాగిన మైకంలో చేతులు, కర్రలు, రాళ్లతో దాడి చేయగా రవితేజ తలకు గాయమైందని సీఐ తెలిపారు. రవితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన జిల్లపల్లి ఆకాశ్, కోట మహేశ్, రెండ్ల శ్రీకాంత్, వానబోయిన నవీన్‌కుమార్, పులి సతీశ్, మరొకరు జిల్లపల్లి ఆకాశ్ స్నేహితుడిపై కేసు మోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఆకాశ్ స్నేహితుడు ప రారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఊరుకునేది లేదని, అవసరమైతే పీడీ యాక్ట్ న మోదు చేయడానికైనా వెనుకాడమని హెచ్చరించారు.

రోడ్డుపై బర్త్‌డే వేడుకలు నిర్వహించినవారిపై..

ఆదిలాబాద్‌రూరల్: గత నెల 19న మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుపై అనుమతి లేకుండా షెల్కే అజయ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించగా అతడితోపాటు పలువురిపై కేసు నమోదు చేసిన్నట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మావల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. అనుమతి లేకుండా రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు జరుపుకొని, రోడ్డును అడ్డుకోవడం, అనుమతులు లేకుండా టపాసులు కాల్చడం, అరుపులు శబ్దాలతో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు కలిగించిన కారణంగా ఆయనతోపాటు పలువురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మావల సీఐ కర్రె స్వామి, ఎస్సైలు ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళలపై దాడికి పాల్పడిన నలుగురిపై..

ఆదిలాబాద్‌టౌన్: మహిళలపై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రాజేశ్వరిపై అదే కాలనీకి చెందిన ఆడె విఠల్, అతని కోడలు కవిత, కుమారులు విజయ్, సంజయ్ గురువారం దాడి చేశారని పేర్కొన్నారు. అడ్డు వచ్చిన రాజేశ్వరి కూతురు రవళికపై కూడా దాడి చేయడంతోపాటు దుర్భాషలాడినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

దాడి ఘటనలో 48మంది గ్రామస్తులపై..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఎక్స్ రోడ్డు హనుమాన్‌నగర్‌లో స్థలం విషయంలో కర్రలతో దాడి చేసిన 48మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. హనుమాన్‌నగర్‌కు చెందిన జాదవ మేఘనాథ్ కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన స్థలంలో అదే గ్రామస్తులు జెండా పాతారు. తన స్థలంలో జెండా ఎందుకు పాతారు.. అని మేఘనాథ్ వారిని అడగగా మాటామాట పెరిగి కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో 48మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాద కారకుడిపై..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తిర్పెల్లికి చెందిన నర్సింగ్, ప్రశాంత్ ద్విచక్ర వాహనంపై గురువారం ఠాకూర్ హోటల్ నుంచి తిర్పెల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌పై ట్రిపుల్ రైడింగ్‌తో వచ్చినవారు వీరిని అతివేగంగా ఢీకొట్టారు. దీంతో నర్సింగ్, ప్రశాంత్‌కు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనంపై బాధితుడి కుమారుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్‌కు చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు అడ్డివార్ ప్రమోద్ రెడ్డిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. అతడి నుంచి 17 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. దీని విలువ రూ.11,060 ఉంటుందని తెలిపారు.

కేసీఆర్ ఫ్లెక్సీలతో నిమజ్జన శోభాయాత్ర



శోభాయాత్రలో కేసీఆర్ ఫ్లెక్సీలతో మహిళలు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా (బీ) లో గురువారం మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలతో దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. తెలంగాణ పాటలపై మహిళలు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీల అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గాడ్గే సుభాష్, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో 'మెస్రం' పూజలు


జమ్మి ఆకులతో పూజిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: దసరా సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు ప్రత్యేక నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి భారీగా తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. జమ్మి ఆకులతో పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావ్, వంశీయులు కోసేరావ్, కొను కటోడ, నాగ్‌నాథ్, దేవ్‌రావ్, శేఖర్‌బాబు తదితరులున్నారు.

యూపీఎస్సీలో సత్తా చాటిన చెన్నూర్ వాసి


సతీష్ కుమార్

చెన్నూర్: యూపీఎస్సీ నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన భారత గణాంక సేవ(ఐఎస్ఎస్)–2025 పరీక్షలో మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణానికి చెందిన కొమ్మెర సతీష్‌కుమార్ అర్హత సాధించి సత్తా చాటారు. ప్రస్తుతం ఆయన జూనియర్ గణాంక అధికారిగా ఆర్‌వో హైదరాబాద్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో ఎంపికైన అతికొద్ది తెలుగు వ్యక్తుల్లో ఒకరిగా నిలిచారు. దక్షిణ భారత జోన్ నుంచి ఐఎస్ఎస్‌లో గత కొన్నేళ్లుగా ఎంపిక జరగలేదు. తెలుగు ప్రాంతానికి చెందిన వ్యక్తి ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచింది. చెన్నూర్ పట్టణానికి చెందిన వాస్తు నిపుణుడు బ్రహ్మయ్య, జయలక్ష్మీ దంపతుల కుమారుడు సతీష్‌కుమార్ ప్రయాణం కృషి పట్టుదలకు నిదర్శనం. జాతీయ గణాంక శాఖలో జూనియర్ గణాంక అధికారిగా చేరకముందు రైల్వే సేఫ్టీ కమిషన్‌లో సేవలందించారు. తన విజయానికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, కార్యాలయ ప్రధాన అధికారులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐఎస్ఎస్ అధికారులు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత ప్రధాన కారణమని సతీష్‌కుమార్ తెలిపారు.

దసరా తర్వాతే పెద్దబతుకమ్మ


వర్షం కారణంగా ఇంట్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


నిర్మల్‌లో రంగుకాగితాలతో తయారు చేసిన బతుకమ్మలు

- నిర్మల్ ప్రాంతంలో ప్రత్యేకత
- తరాలుగా వస్తున్న ఆనవాయితీ

మనదిక్కు పండుగైనంకనే..



'ఓ... నా చిన్నప్పటి సంది సూస్తున్న. కరీంనగర్, వరంగల్ దిక్కు దసరా పండుక్కు ముందు రోజే సద్దుల బతుకమ్మ ఆడుతరు. మనక్కడ మాత్రం పండుగైనంకనే ఆడుతం. ముందటి సంది బొడ్డెమ్మ పండుగ అట్లనే అస్తున్నది..' అని నిర్మల్‌కు చెందిన 80ఏళ్ల రాం ముత్తమ్మ చెబుతోంది.

నిర్మల్: నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు చాలా మండలాల్లో దసరా తర్వాత మహిళలు సద్దుల బతుకమ్మ ఆడడం ఆనవాయితీగా వస్తోంది. ఓ వైపు రాష్ట్రమంతా... సాలో మహాలయ అమావాస్య మరుసటి రోజు సద్దుల బతుకమ్మ ఆడడం ప్రత్యేకత కాగా.. నిర్మల్ ప్రాంతంలో పండుగ తర్వాత సద్దుల సందడి కొనసాగుతూ ఉండడం ఇక్కడి స్పెషల్. పూలను పూజించే ఈ పండుగలో ఇక్కడ కాగితంతో బతుకమ్మలను చేయడం మరో ప్రత్యేకత. దసరా సెలవులు పూర్తవుతున్నా.. చాలామంది యువతులు, విద్యార్థినులు సద్దుల బతుకమ్మ కోసం ఆగడం విశేషం.

పౌర్ణమి దాకా ఆటపాటలే...

తెలంగాణ వ్యాప్తంగా దసరాకు ముందే బతుకమ్మ పండుగ ముగుస్తుంది. కానీ.. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న జిల్లా మాత్రం ఎన్నో ప్రత్యేకతలను చాటుకుంటోంది. ఒక్కో గ్రామంలో ఒక్కోరోజు పండుగలా సద్దులబతుకమ్మను తీసుకెళ్తుంటారు. నిర్మల్ ప్రాంతంలో దసరా తర్వాత మొదలయ్యే సద్దుల బతుకమ్మల సందడి ఒక్కో ఊళ్లో ఒక్కోరోజు ఉంటుంది. ఈ రోజు(శనివారం) నుంచి ఇలా పౌర్ణమి వరకు రోజూ బతుకమ్మల ఆటపాటలు సాగుతూనే ఉంటాయి. ప్రతీసాయంత్రం గ్రామాలతో పాటు జిల్లాకేంద్రంలోనూ పండుగ వాతావరణం కనిపిస్తుంటుంది.

కాగితంతో బతుకమ్మ..

జిల్లాలో బతుకమ్మకు మరో ప్రత్యేకత కూడా ఉంది. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ రంగురంగుల కాగితాలతో బతుకమ్మలను తయారు చేస్తారు. పూలను పూజించే ప్రకృతి పండుగలతో ఇలా కాగితాలతో బతుకమ్మలను చేసి ఆడడం ఏంటని చాలామంది ప్రశ్నిస్తుంటారు. గతంలో కరువు పరిస్థితులు ఉన్నప్పుడు నిమజ్జనానికి నీళ్లు లేకపోవడం, అలాగే పువ్వులు లభించకపోవడం తదితర కారణాలతో కాగితపు బతుకమ్మలతో ఆడడం ప్రారంభమై ఉండొచ్చన్న అభిప్రాయం ఉంది.

మానాయి ఉన్నందునే...



కరీంనగర్, వరంగల్ వైపు దసరాకు ముందురోజే సద్దుల బతుకమ్మ ఆడుతారు. కానీ.. మాదిక్కు మానాయి(మహర్నవమి) పెద్దపండుగగా చేసుకుంటాం. ఆ రోజు ఇంట్లో నుంచి పసుపుకుంకుమలు, మంగళహారతి సహా ఏ వస్తువునూ బయటకు తీసుకెళ్లం. అందుకే సద్దుల బతుకమ్మను దసరా తర్వాతనే చేసుకుంటాం.

–ఏనుగుల విమల, నిర్మల్

బతుకమ్మ కోసమే...



దసరా పండుగంటే చాలా ఇష్టం. అందులోనూ బతుకమ్మ అంటే ఇంకా ఇష్టం. రోజూ అమ్మ వాళ్లతో కలిసి పాడుతూ ఆడుతూ నేర్చుకుంటాం. ఇక దసరా తర్వాత సద్దుల బతుకమ్మ కోసమే హైదరాబాద్ వెళ్లకుండా నిర్మల్‌లోనే ఉంటా.

– అనన్య, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, నిర్మల్

'గడ్డం' బ్రదర్స్ దూరం.. దూరం!

- వేదికను పంచుకోని అన్నదమ్ములు
- కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశం

బెల్లంపల్లి: దసరా వేడుకల వేళ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో గురువారం రాత్రి ఆసక్తికర, ఆశ్చర్యకరమైన సన్నివేశం చోటు చేసుకుంది. విజయదశమి వేడుకల్లో భాగంగా సింగరేణి తిలక్ స్టేడియంలో హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌తో పాటు ఆయన సోదరుడు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. రాత్రి 7.15గంటల ప్రాంతంలో మంత్రి వివేక్ స్టేడియంకు రాగా.. ఎమ్మెల్యే వినోద్ పాల్గొనకపోవడం సభికులను ఆశ్చర్యానికి గురి చేసింది. కొంతసేపటి తర్వాత మంత్రి వివేక్ తన ప్రసంగం ముగించి 7.35గంటలకు మందమర్రిలో నిర్వహించే రాంలీల కార్యక్రమానికి హాజరు కావాలంటూ సభికులకు దసరా శుభాకాంక్షలు తెలియజేసి వేదిక దిగి వెళ్లిపోయారు. మంత్రి వెళ్లిపోయిన విషయాన్ని కొందరు సమాచారం ఇవ్వడంతో అరగంట తేడాతో ఆయన సోదరుడు వినోద్ మైదానానికి చేరుకున్నారు. అప్పటివరకు బాలికల సాంస్కృతిక కార్యక్రమాలతో సభికులు కదలకుండా చూశారు. తమ్ముడు హాజరైన కార్యక్రమానికి అందుబాటులో ఉండి కూడా ఎమ్మెల్యే హాజరు కాకపోగా.. క్యాంపు కార్యాలయానికి వెళ్లి అన్నను తమ్ముడు కలువకపోవడం సభికులు, పురప్రజలను విస్మయానికి గురి చేసింది. ఈ సంఘటన తోబుట్టువుల మధ్య నెలకొన్న అసమ్మతికి నిదర్శనమని పలువురు పేర్కొనడం గమనార్హం. ఇద్దరి మధ్య ఎందుకు పొరపొచ్చాలు వచ్చాయో తెలియదు కానీ ముఖ్య అతిథులుగా హాజరు కావాల్సిన వినోద్, వివేక్ దూరం దూరంగా ఉండడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వీరి తీరుపై పురప్రజలు పలు రకాలుగా చర్చించుకోవడం వినిపించింది. ఈ ఘటన కాంగ్రెస్ శ్రేణులను కూడా గందరగోళానికి గురి చేసి చర్చనీయాంశంగా మారింది.

కనువిందు చేస్తున్న జలపాతం


వాస్తాపూర్ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

మామడ: నిర్మల్ జిల్లా మామడ మండలం వాస్తాపూర్ జలపాతం ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో కొండల మధ్య 25 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ పాలధారను మరిపిస్తోంది. దసరా సెలవుల నేపథ్యంలో పర్యాటకుల రద్దీ పెరిగింది. జలపాతం వీక్షణకు వివిధ ప్రాంతాల వారు వస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వచ్చి గంటలకొద్దీ సరదాగా గడుపుతున్నారు. సెల్ఫీలు దిగుతూ ఫొటోషూట్ చేస్తున్నారు.

కేంద్రమంత్రికి బహిరంగ లేఖ


లేఖను విడుదల చేస్తున్న విశ్రాంత కార్మికులు

మంచిర్యాలటౌన్: సింగరేణి బొగ్గు పింఛన్‌దారులు 80 వేల మంది కుటుంబాలకు వివిధ బ్యాంకు ఖాతాల్లో సీఎంపీఎఫ్ అధికారులు ప్రతీ నెల ఇచ్చే కోల్‌మైన్స్ పెన్షన్‌ను బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో జమ చేయకపోవడంపై జిల్లాలోని విశ్రాంత సింగరేణి ఉద్యోగులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. ప్రతీ నెల ఒకటిన ఆయా బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగరేణివ్యాప్తంగా రూ.350 నుంచి రూ.1000 పెన్షన్ తీసుకునే విశ్రాంత ఉద్యోగులు వేలాది మంది ఉన్నారని, గత 26 ఏళ్లుగా పెన్షన్ పెంపుదలకు నోచుకోక అతి తక్కువ పెన్షన్ పొందుతున్న ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని, పెన్షన్ పెంపుదలను అమలు చేయాలని కోరారు. మూడో తేదీ వచ్చినా పెన్షన్ పడకపోవడంతో విశ్రాంత కార్మికులకు ఇబ్బందిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు సిహెచ్.రామస్వామి, ఏ.రాజేశం, లక్ష్మణ్, చంద్రయ్య, రెడ్డన్న, యాదవ్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

దసలి పట్టు పురుగుల పెంపకానికి అనుమతి ఇవ్వాలి


అటవీ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న రైతులు

కోటపల్లి: దశాబ్దాలుగా పట్టుపురుగుల పెంపకంతో ఉపాధి పొందుతున్నామని, పెంపకానికి అనుమతి ఇవ్వాలని తుడుందెబ్బ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కావర్ కొత్తపల్లి గ్రామంలోని అటవీప్రాంతంలో శుక్రవారం పట్టుపురుగుల పెంపకానికి వెళ్లిన ఆదివాసీ రైతులను అటవీ అధికారులు అడ్డుకోగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తమ ఉపాధిని అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, ఎన్నో ఏళ్లుగా జీవనం పొందే పట్టుపురుగులను అహంకార ధోరణితో చంపేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. 750 మంది కుటుంబాలు పట్టుపురుగుల పెంపకంతో ఉపాధి పొందుతున్నాయని, అధికారులు ఫారెస్టులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి భయాభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన చెందారు. ఈ సందర్భంగా జేక శేఖర్ మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు అమాయకపు ఆదివాసీలపై దాడులు చేసి ఉపాధి పొందుతున్న పట్టుపురుగులను నాశనం చేయడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో పట్టుపురుగుల పెంపకంపై ఎక్కడా లేని ఆంక్షలు చెన్నూర్ నియోజకవర్గంలో మాత్రమే ఉండడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. అధికారులు ఆదివాసీలపై దాడులు ఆపి, పట్టుపురుగుల పెంపకానికి అనుమతి ఇచ్చేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి మంత్రం..సేవాభావం



మీరు చూస్తున్న ఈ చిత్రం సిరిసిల్ల పట్టణంలోని ప్రధాన డ్రైయినేజీ. రెండు నెలల క్రితం చెత్తతో నిండి ఉండగా.. నూరు రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ అధికారులు పరిశుభ్రంగా మార్చారు. ఫలితంగా కాల్వ నుంచి వెదజల్లే దుర్గంధం నిలిచిపోయింది.



మీరు చూస్తున్న ఈ ఫొటో సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన జగ్గారావుపల్లె. మున్సిపల్ అధికారులు ప్రజల్లో అవగాహన చేపట్టగా ఓ ఇంటి పరిసరాల్లో యజమాని ఇంకుడుగుంతను ఇలా తవ్వించుకున్నాడు. ఫలితంగా వర్షం నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంచడంలో ప్రజల భాగస్వామ్యానికి ఇదో సాక్ష్యం.


మీరు చూస్తున్న ఈ ఫొటో సిరిసిల్ల రెండో బైపాస్‌రోడ్డులో ఎల్ఈడీ లైట్ల వెలుగులు. సుమారు 11 కిలోమీటర్లు గల ఈ రోడ్డు మధ్యలో లైటింగ్ లేక తరచూ ప్రమాదాలు జరుగుతుండేవి. వాటిని అరికట్టడంతోపాటు పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

- బల్దియా ప్రణాళిక సక్సెస్
- ప్రజల భాగస్వామ్యంతో పూర్తిచేసిన వైనం
- నూరురోజుల పట్టణ ప్రణాళిక పూర్తి

సిరిసిల్లటౌన్: ప్రగతిపథంలో ఉన్న సిరిసిల్ల కీర్తి మసకబారకుండా చేపట్టిన నూరురోజుల ప్రణాళిక సక్సెస్ దిశగా అడుగులు పడింది. అధికారుల కార్యసిద్ధి, సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం, కార్మికుల కష్టం కలిసి పరిశుభ్ర సిరిసిల్లగా మారింది. బల్దియా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు.. సేవాభావం.. ప్రజల్లో చైతన్యం.. స్వచ్ఛతలో భాగస్వామ్యం వంటి అంశాల్లో అధికారులు సఫలమయ్యారు.

లక్ష్య సిద్ధి..దాని ప్రభావం

పట్టణంలోని 39 వార్డులలో పురపాలన కార్యక్రమాలు స్వచ్ఛత, ఆరోగ్యం కమ్యూనిటీ భాగస్వామ్యంపై బల్దియా దృష్టి సారించింది. రైజింగ్ తెలంగాణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రణాళిక స్వచ్ఛత, ఆరోగ్యం మరియు పట్టణ పాలన లక్ష్యాలను వేగవంతం చేయడానికి సహాయపడింది.

- 7.75 కి.మీ ప్రధాన కాలువలు, 264.32 కి.మీ చిన్న కాలువలను శుభ్రం చేశారు.
- వ్యర్థాలు కాలువల్లో పడకుండా 12 కాలువలకు 1000 మీటర్ల రక్షణ మెష్‌ను ఏర్పాటు చేశారు.
- 30,409 గృహవాసులకు ఇంటింటికీ అవగాహన కల్పించారు.
- మూడు పాఠశాలల్లో కంపోస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు.
- ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణలో భాగంగా పట్టణంలోని 10 పబ్లిక్ టాయిలెట్లను తనిఖీ చేశారు.
- డెంగీ, మలేరియాపై వార్డుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
- పారిశుధ్య కార్మికుల కోసం మూడు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు.
- 137.4 కి.మీ. రహదారుల పక్కన ఉన్న చెట్లు, పొదలను తొలగించారు.
- 17 గుంతలను పూడ్చివేశారు, 38 పాత భవనాలను తొలగించారు.
- బల్దియా ఆదాయం పెంచుకోవడానికి 2,657 ఆస్తులను గుర్తించారు. వాటి ద్వారా రూ.13.44 లక్షల ఆదాయం పెరిగింది.
- 62 వీధి వ్యాపార సంఘాలు, 30 కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేశారు.
- నీటి నాణ్యత, భద్రత కోసం 39 వార్డులలో క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించి, 24 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు.
- జంతు జనన నియంత్రణ(ఏబీసీ) ప్రారంభించారు.

ప్రజల భాగస్వామ్యంతో పూర్తి చేశాం



ప్రభుత్వ ఆదేశాలతో రైజింగ్ తెలంగాణలో భాగంగా నూరు రోజుల ప్రణాళికను రూపొందించాం. ప్రజల భాగస్వామ్యంతో అనుకున్న సమయంలో ప్రణాళికను పూర్తి చేయగలిగాం. సిరిసిల్ల స్వచ్ఛకీర్తి, అభివృద్ధి నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎంఏ ఖదీర్‌పాషా, మున్సిపల్ కమిషనర్


ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన


కళాకారుల విచిత్ర వేషధారణ


మహిళల కోలాటం

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం అమ్మవారి శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. అందంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఆశీనులను చేసిన ప్రముఖులు, మండప నిర్వాహకులు.. డప్పు చప్పుళ్లు, ఆటాపాటలతో పురవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా మహిళా భక్తులు మంగళహారుతులతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. పలువురు కళాకారుల ప్రదర్శనలు విశేషంగా కట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

'సికిల్‌సెల్'తో కొడుకు మృతి

- అదే వ్యాధితో కూతురు ఆస్పత్రిలో..
- శోకసంద్రంలో తల్లిదండ్రులు


మృతి చెందిన సన్ని


ఇందు

ధర్మపురి: కూలీనాలీ చేసుకునే కుటుంబాన్ని విధి వక్రించింది. సికిల్ సెల్ వ్యాధితో కొడుకు మృతి చెందగా.. ఆ దుఃఖంలోనే కూతురుకు కూడా ఒకే రోజు అదేవ్యాధితో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రికి తరలించిన సంఘటన చిన్ననక్కలపేట గ్రామంలో విషాదాన్ని నింపింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం చిన్ననక్కలపేట గ్రామానికి చెందిన నల్ల వసంత–శేఖర్ దంపతులకు కూతురు ఇందు (14), కుమారుడు సన్ని (10) ఉన్నారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. కొడుకు సన్ని ఇటీవల కళ్లు తిరిగి కింద పడి పోవడంతో ధర్మపురిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా సికిల్‌సెల్ వ్యాధిగా అనుమానించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. కొడుకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా అదే సమయంలో కూతురు ఇందు తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే ధర్మపురిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఇందును చికిత్స నిమిత్తం బంధువులు హైదరాబాద్‌కు తరలించారు. ఒక వైపు కొడుకు మృతి మరోవైపు కూతురు ఆస్పత్రి పాలు కావడంతో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగారు. కొడుకు అంత్యక్రియలు సాయంత్రం గ్రామంలో పూర్తి చేసి అనంతరం తల్లిదండ్రులు కూతురు వద్దకు వెళ్లిపోయారు. రెండు కళ్లలాంటి ఇద్దరు పిల్లల్లో కొడుకు మృతి చెందగా.. కూతురు అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కావడంలో ఆ కుటుంబలో తీరని దుఃఖాన్ని నింపింది. ఆ కుటుంబాన్ని చూసి గ్రామస్తులంతా తల్లడిల్లిపోయారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి పునరుద్ధరణ


రామగుండం ఎరువుల కర్మాగారం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో గురువారం యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించారు. గత ఆగస్టు 14న అమ్మోనియా కన్వర్టర్ పైప్‌లైన్ లీక్ కావడంతో ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. మరమ్మతుల అనంతరం గతనెల 28న పునరుద్ధరించారు. ప్లాంట్ రోజూ 3,850 మెట్రిక్ టన్నుల యూరియా, 2,200 మెట్రిక్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తుంది. హెచ్‌టీఆర్‌లో అమ్మోనియా కన్వర్టర్ మరమ్మతుల తర్వాత పూర్తిస్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి పునరుద్ధరణ కావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మరో నాలుగు రోజుల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు రైలు మార్గం ద్వారా సుమారు 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెద్దపల్లిలో 'అమృత్‌భారత్'కు హాల్టింగ్


ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారని అంటున్నారు.

రామగుండం: ఉత్తర భారత రాష్ట్రాల్లోని కార్మికుల సౌకర్యార్థం 13 అమృత్ భారత్ రైళ్లను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. అందులో రెండు తెలంగాణకు కేటాయించారు. ఇందులో భాగంగానే జోగ్బాని–ఈరోడ్ మధ్య నడిచే(16601/02) అమృత్ భారత్ రైలుకు తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. కాగా, ఇటీవల చర్లపల్లి–ముజాఫర్‌పూర్ మధ్య(15293/94) రైలును ప్రారంభించిన విషయం తెలిసిందే. బిహార్ ఎన్నికల నేపథ్యంలో ఈ రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చారని అంటున్నారు.